క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



విద్యార్థి గళం పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ...

లక్సెట్టిపేట: లక్సెట్టిపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'విద్యార్థి గళం' అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి సభ్యులు మాట్లాడుతూ.. మూడు మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాసిన కవితలను ముద్రించినట్లు తెలిపారు. రేపటి తరానికి సాహిత్యాన్ని పరిచయం చేయటం దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. సమావేశంలో సాహితీ స్రవంతి అధ్యక్షురాలు ల్యాదల గాయత్రి, ప్రధాన కార్యదర్శి న్యాటెంకి రవీంద్ర, సంపాదకులు వెనంక చక్రవర్తి, ముద్రణా సహకారం అందించిన కందుల తిరుపతి, పుస్తక సమీక్ష చేసిన రాచకొండ శ్రీనివాస్, ప్రముఖ కవులు సుబ్బాయమ్మ, లేదేళ్ల రాజేశ్వర్‌రావు, కొండు జనార్దన్, గఫర్, సుదంస్, గుర్రాల శ్రీనివాస్, నూటెంకి భారతి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని శంకర జ్యోతిష్య వాస్తు నిలయం ఆధ్వర్యంలో డా.కొమ్మెర దత్తమూర్తిశర్మ సిద్ధాంతితో సంకలనం చేసిన యజుర్వేద వివాహప్రయోగ చంద్రిక, శ్రీగోపాల సహస్రనామ స్తోత్రములను చెన్నూర్ బ్రాహ్మణ సేవా సంఘంలో రాంపల్లి నారాయణ శర్మ అవధాని, పెద్దబూదె, చికిలి లక్ష్మీవెంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొమ్మెర రాజేశ్వర శర్మ, విశ్వేశ్వరశర్మ, శ్రీమూర్తి పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో ఎట్టకేలకు డ్రెయినేజీపై కల్వర్టు నిర్మాణం పనులు ప్రారంభించారు. మార్చి 19న 'ప్రమాదకరంగా కల్వర్టు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి స్పందించి గ్రామ పంచాయతీ నిధుల ద్వారా పనులు ప్రారంభించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజారమేశ్

భీమారం: బీఆర్‌ఎస్ పార్టీ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు మణిదీప్, పోటు రాజేశ్వర్‌రెడ్డి, దాసరి గోపాల్, ఆత్కూరి రాములు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

చెన్నూర్‌రూరల్: పత్తి మిల్లు నుంచి పత్తి గింజల లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని కిష్టంపేట గ్రామం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట గురువారం రాత్రి ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. శుక్రవారం పత్తి గింజల బస్తాలను వేరే లారీలోకి ఎక్కించారు.

యేసు క్రీస్తు పునరుత్థాన జాతర ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

లక్సెట్టిపేట: యేసుక్రీస్తు పునరుత్థాన జాతరలో భాగంగా మండలంలోని క్రైస్తవులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి చర్చి వరకు డీజే చప్పుళ్లతో డ్యాన్స్‌లు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు హాజరయ్యారు. ఫాదర్‌లు సామ్యేల్, వినిస్టన్, డేవిడ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. ప్రకృతి సోయగం



జైపూర్: ముదిగుంట-కాస్నూర్ వెళ్లే దారిలో...



చెన్నూర్‌రూరల్: ఎల్లక్కపేట-కిష్టంపేట వెళ్లే రహదారిలో...

గత ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. జైపూర్ మండలం పరిధిలోని ముదిగుంట-కాస్నూర్, చెన్నూర్ మండలంలోని ఎల్లక్కపేట-కిష్టంపేట, నెన్నెల-బెల్లంపల్లికి వెళ్లే రహదారుల మధ్యలో వేసవి కాలంలో సైతం చెట్లు గుబురుగుబురుగా అల్లుకుపోయి, చల్లదనాన్ని పంచుతున్నాయి. ఓ పక్క ఎండలు తీవ్రస్థాయిలో మండిపోతుండటంతో, ఆ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కొంత ఆ చెట్లు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. – జైపూర్/చెన్నూర్‌రూరల్/నెన్నెల



నెన్నెల నర్సరీ వద్ద...

యువకులు జీవిత గెలుపును ఆస్వాదించాలి



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్, పక్కన ఏసీపీ, సీఐలు

తాండూర్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండి యువత జీవిత గెలుపును ఆస్వాదించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం యాంటి డ్రగ్స్ అవేర్నెస్‌పై సీఐ కుమారస్వామి అధ్యక్షతన సబ్ డివిజన్‌స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్‌కట్ చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం యువకులు ముందుకు రావాలన్నారు. లక్ష్యాలను ఎంచుకొని యువకులు చదువుకోవడంతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. మెరుగైన సమాజం కోసం యువకులు పోలీసులకు సహకరించాలన్నారు. తాండూర్ సీఐ ప్రత్యేక చొరవ తీసుకొని సబ్ డివిజన్‌స్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, బెల్లంపల్లి సీఐలు ఎన్.దేవయ్య, అఫ్జలుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, సబ్ డివిజన్‌పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరం అద్భుత అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅర్బన్: వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు అద్భుత అవకాశమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సైన్స్ సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. సైన్స్ సమ్మర్‌క్యాంపునకు 186 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 120 మందికి అవకాశం కల్పించారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, పరీక్షల విభాగం సెక్రెటరీ మహేశ్వర్‌రెడ్డి, మండల విద్యాధికారి మాలవీదేవి, విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు సత్యనారాయణ, కోడింగ్ సెన్సార్ నిపుణులు సాల్మన్‌జోన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

పాతమంచిర్యాల: కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మపున్నం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిన పోలీస్ యంత్రాంగం, పెత్తందార్లను కాపాడడం కోసం ప్రయత్నిస్తుందన్నారు. కన్నయ్య ఆత్మహత్యకు కారకులైన ఎనగంటి చిన్నన్న రెడ్డి, అతడి భార్య లక్ష్మితో పాటు కన్నయ్య భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న హరీష్‌రెడ్డి, అక్రమంగా పట్టా మార్పిడి చేసిన రెవెన్యూ అధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం ఎదుట కన్నయ్య కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయిని కన్నయ్య భార్య స్వరూప, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మరమల శంకర్, పోశం, సీఐటీయూ శ్రామిక మహిళా నాయకురాలు దాసరి రాజేశ్వరి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఉమారాణి పాల్గొన్నారు.

'ఆలయం వద్ద చెత్త డంప్ చేయొద్దు'

నస్పూర్: పట్టణ పరిధిలోని ముక్కిడి పోచమ్మ ఆలయం సమీపంలో గల పోలేరమ్మ ఆలయం చుట్టుపక్కల చెత్తను డంప్ చేయకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గురువారం రాత్రి చెత్తలో మంటలు చెలరేగి, ఆలయం పరిసరాలలోని కర్రలు, సిరామిక్స్ పైపులు, పచ్చని చెట్లు కాలిపోయాయన్నారు. సమయానికి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారని, లేకపోతే ఆలయంలోని విలువైన వస్తువులు తగలబడిపోయేవని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఆలయం సమీపంలో చెత్తను డంప్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పహల్గాం దాడి ఘటనపై నిరసన



చెన్నూర్ ఐబీ చౌరస్తాలో ముస్లింల నిరసన



నెన్నెలలో కొవ్వొత్తుల ర్యాలీ



భీమారం: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న యువకులు

భీమారం/నెన్నెల/నస్పూర్/జన్నారం/దండేపల్లి/చెన్నూర్/బెల్లంపల్లి/మందమర్రిరూరల్/భీమిని: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో భారతీయులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నస్పూర్‌లో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి పహల్గాం చర్యను అత్యంత హేయమైనదిగా అభివర్ణించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగల్ల ఉపేందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న, మండల సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ రాజమౌళి, కరస్పాండెంట్లు అమస్‌ప్రసాద్, ప్రమోద్, ఆమని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేటలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ నాయకులు మసీదు వద్ద మౌనప్రదర్శన నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మసీదు కమిటీ సదర్ దావూద్‌ఖాన్, ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు. చెన్నూర్ పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మందమర్రి, బెల్లంపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భీమారంలో చెన్నూరు-మంచిర్యాల జాతీయరహదారిపై యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. హిందువులపై హత్యాకాండను ఖండిస్తూ హిందూఐక్య వేదిక ఆధ్వర్యంలో జన్నారం మండలం బంద్ పాటించింది. మండల కేంద్రంలోని దుకాణ సముదాయాలు, హోటళ్లు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అనర్హులకు చోటు'

కాసిపేట/వేమనపల్లి: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అసలైన పేదలకు కాకుండా, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలను అర్హులుగా ఎంపిక చేశారని వేమనపల్లి, కాసిపేట మండలాల బీజేపీ అధ్యక్షులు ఏట మధుకర్, సూరం సంపత్‌కుమార్ ఆరోపించారు. వేమనపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాసిపేట మండలం చిన్నధర్మారంలో దరఖాస్తులు చేసుకున్న, అర్హులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇళ్ల ఎంపికలో కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఇళ్లు ఉన్న వారికి ఎకరాల కొద్ది భూములు ఉన్న వారిని జాబితాలో చేర్చారన్నారు. కార్యక్రమంలో వేమనపల్లి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మధునయ్య బీజేవైఎం, మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు చరణ్‌రాజ్, కాసిపేటలో మాజీ వార్డు సభ్యులు సత్యా, బీజేపీ మండల నా యకులు పెద్దపల్లి శంకర్, నగురారపు ప్రసన్న, ఇస్లావత్ సంపత్, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

భీమారం: పంటపొలంలో వరిపైరు పూర్తిగా ఆరిన తర్వాతనే కోతలు మొదలు పెట్టాలని ఏవో అత్తె సుధాకర్ తెలిపారు. మండలంలోని పోలంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వరి కోసే సమయంలో హార్వెస్టర్ ఫ్యాన్ 18–20ఆర్‌పీఎం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. తేమ 17శాతం మించకుండా చూసుకొని కేంద్రాలకు తరలించాలని ఆయన కోరారు.

మలేరియా నివారణపై అవగాహన



నెన్నెలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది శుక్రవారం ప్రపంచ మలేరియా నియంత్రణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ మాట్లాడుతూ.. దోమకాటుతో మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, దోమలు వృద్ధి చెందకుండా దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తపాలాపూర్‌లో మలేరియాపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీ పెల్లి రమేశ్, ఆశ కార్యకర్త విజయ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లంబడిపల్లిలో కార్డన్ సెర్చ్



సామగ్రి, ద్విచక్ర వాహనాలతో పోలీసులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామంలో చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 50ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నాటుసారా స్థావరాలు గుర్తించి బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి నాటుసారా, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. యువత సన్మార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, పోలీసు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మందమర్రిరూరల్: జీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్, మందమర్రి జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాలను జనరల్ మేనేజర్లు ఎం. శ్రీనివాస్, దేవేందర్‌కు అందజేశారు. తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు గనులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని, ప్రభుత్వం బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దని, సింగరేణిలో అమలవుతున్న మెడికల్ రిఫరల్ విధానం సమీక్షించాలని, రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్‌లలో కార్మిక అవసరాలకు తగినట్లు రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు బొగ్గు కొనుగోళ్ల ద్వారా చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, బండి రమేశ్, పొగాకు రమేశ్, నాయకులు గొర్ల సంతోశ్, బుస్స రమేశ్, మారం శీను, మహిపాల్‌రెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, వెంగళ కుమారస్వామి, అన్వేశ్‌రెడ్డి, ముస్త్యాల రమేశ్, తిరుమల్‌రావు, రాజునాయక్, మందమర్రిలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు బడికెల సంపత్‌కుమార్, రాజశేఖర్, రాజిరెడ్డి, కొండల్‌రావు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ అందిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28నుంచి ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 8, 9, 10తరగతుల విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలోనే ఈ శిక్షణ అందిస్తామని, ఆసక్తి గలవారు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాల్సిందిగా సూచించారు.

బొగ్గుబాయి వార్తలు

నూతన క్రేన్ ప్రారంభం



కేకే-ఓసీలో నూతన క్రేన్‌ను ప్రారంభిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో నూతనంగా 40టన్నుల కెపాసిటీ గల నూతన క్రేన్‌ను శుక్రవారం ఏరియా జీఎం దేవేందర్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గని ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఇంజనీర్ వంశీధర్, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీధర్‌గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


మందమర్రిరూరల్: ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ ఆటల్లో వేసవి శిక్షణ ఇవ్వడానికి కోచ్‌ల కోసం అనుభవజ్ఞులైన పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యామ్‌సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్‌కు చెందిన ఆసక్తి గల పీఈటీలు ఈ నెల 28లోగా ఏరియా పర్సనల్ ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

భారత్ సమ్మిట్‌కు ఎమ్మెల్యే వినోద్ హాజరు

బెల్లంపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ వేదికగా ఈ నెల 25, 26తేదీల్లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమానికి శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రపంచ వ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి సుమారు 450మందికి పైగా ప్రతినిధులు హాజరు కానుండగా, అంతటి ప్రాధాన్యత కలిగిన సమ్మిట్‌లో ఎమ్మెల్యేకు ప్రాధాన్యత లభించింది. ఈ సమ్మిట్ ద్వారా ప్రజాస్వామ్య విలువలకు మళ్లీ జీవం పోసే ప్రయత్నం జరుగుతోందని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరి గురుదీప్‌సింగ్, ఎంపీ మల్లు రవితో కలిసి సమ్మిట్ ఏర్పాట్లను వినోద్ పర్యవేక్షించారు.

అనారోగ్యంతో బీట్ ఆఫీసర్ మృతి



ప్రసన్న (ఫైల్)

కోటపల్లి: మండలంలోని అన్నారం గ్రామంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న(28) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందింది. విధుల్లో చురుకుగా ఉండే బీట్ ఆఫీసర్ ప్రసన్న మృతిచెందడంతో సిబ్బంది తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రసన్న మృతిపై సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఆధ్వర్యంలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, యాదగిరి, సికిందర్, వెంకన్న, అప్పారావు, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా సదస్సు జయప్రదం చేయండి

దండేపల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 27న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. దండేపల్లిలో శుక్రవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు.

నేడు భూ భారతిపై అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తహసీల్దార్ మహేంద్రనాథ్ తెలిపారు. సదస్సుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్ హాజరు కానున్నట్లు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.